మహిళలు స్వయం ఉపాధిలో రాణించాలి

శిక్షణలో మహిళలు తయారు చేసిన దుస్తులను పరిశీలిస్తున్న మైనార్టీ నాయకులు

రామచంద్రాపురం, ఫిబ్రవరి 10: మహిళలు స్వయం ఉపాధిలో రాణించాలని మైనార్టీ నాయకుడు షేక్‌అబ్దుల్ ఘనీ, ఏకే ఫౌండేషన్ చైర్మన్ షేక్‌అబ్దుల్ ఖదీర్ అన్నారు. ఆర్సీపురం డివిజన్‌లోని శ్రీనివాస్‌నగర్‌కాలనీలో ఉన్న రాయల్ మదీనా కమ్యూనిటీ హాల్‌లో ముస్లిం మైనార్టీ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో మూడు నెలలపాటు టైలరింగ్‌లో శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలను వారు అభినందించారు. టైలరింగ్ శిక్షణలో భాగంగా మహిళలు తయారు చేసిన దుస్తులను మైనార్టీ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలకు టైలరింగ్‌లో శిక్షణ ఇప్పించి స్వయం ఉపాధిని ప్రోత్సహించామన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలు ఎవరిపై ఆధారపడకుండా వారి కాళ్ల మీద వారు నిలబడే ధైర్యం వచ్చిందన్నారు. కార్యక్రమంలో అబ్దుల్ గఫూర్, రేహాన్‌ఖాన్, సలీంఫారూఖీ, హసీను ద్దీన్, సయ్యద్ అక్బర్, చాంద్‌పాషా, కరీముద్దీన్, అజీముద్దీన్, మొయినుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్డీవో జ్యోతి

ఆరోగ్యం, పౌష్టికాహారంపై అవగాహన

సంగారెడ్డి కలెక్టరేట్, ఫిబ్రవరి 10: డీఆర్డీఏ సెర్ఫ్‌హెచ్‌డీ కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక బైపాస్ రోడ్డులోని జిల్లా సమాఖ్య కార్యాలయంలో పౌష్టికాహారం, ఆరోగ్యం పరిశుభ్రత అనే అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి జ్యోతి మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్య మని పేర్కొన్నారు. పోషకాలు నష్టపోకుండా వంట చేసే పద్ధతులు నేర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సమాఖ్య సభ్యులు, మహిళా సంఘాల నాయకులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం వివిధ అంశాలపై మహిళలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు గ్రామీణాభివృద్ధి అధికారులు జంగారెడ్డి, బాల్‌రాజ్, డీపీఎంలు జయశ్రీ, మల్లేశం, కొమురయ్య, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసేందుకు టాలెంట్ టెస్ట్

డీఈవో వెంకటేశ్వర్లు

సంగారెడ్డి కలెక్టరేట్, ఫిబ్రవరి 10: విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మకత, ప్రతిభను వెలికితీసేందుకు టాలెంట్ టెస్ట్‌లు దోహదం చేస్తాయని డీఈవో వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. జిల్లా విద్యాశాఖ, ఎఫ్‌ఏఎస్‌టీ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక బైపాస్ రోడ్డులోని సైన్స్‌కేంద్రంలో జిల్లాస్థాయి భౌతిక, రసాయన శాస్త్ర టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ టెస్ట్‌లో 70 మంది విద్యార్థులు, వారి గైడ్ టీచర్లు పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డీఈవో విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ టాలెంట్ టెస్ట్ ద్వారా విద్యార్థుల ప్రతిభా పాటవాలు బయటపడతాయన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సైన్స్ అధికారి సిద్ధారెడ్డి, డీఈఏబీ చైర్మన్ లింబాజి, ఎఫ్‌ఏఎస్‌టీ జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్, గౌరవ అధ్యక్షుడు మదన్ గోపాల్, ప్రధాన కార్యదర్శి మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డీఈవో వెంకటేశ్వర్లు

రాష్ట్రస్థాయి సైన్స్ టాలెంట్ టెస్ట్‌కు బొల్లారం విద్యార్థి

కార్తిక

జిన్నారం, ఫిబ్రవరి 10: జిల్లాస్థాయి సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో జిన్నారం మండలం బొల్లారం మున్సిపాలిటీ తెలంగాణ ఆదర్శ పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థిని కార్తిక ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి ప్రకటనలో తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సైన్స్ సెంటర్లో జరిగిన టాలెంట్ టెస్ట్ పోటీలు – 2025లో 70 మంది విద్యార్థులు పాల్గొనగా పాఠశాల తరపున కార్తిక అద్వితీయ ప్రదర్శనతో ప్రశంసా పత్రంతో పాటు జ్ఞాపికను సాధించిందని తెలిపారు. ఈనెల 12వ తేదీన రాష్ట్ర స్థాయిలో జరిగే ఫిజికల్ సైన్స్ టాలెంట్ టెస్ట్ పోటీల్లో జిల్లా తరపున పాల్గొననున్నట్లు తెలిపారు. ఉత్తమ ప్రతిభ చాటిన విద్యార్థినిని ప్రిన్సిపాల్‌తోపాటు ఉపాధ్యాయులు, గైడ్ టీచర్లు, అభినందించారు. కాగా విద్యార్థిని కార్తిక గతంలోనూ సోషల్ స్టడీస్ టాలెంట్ టెస్ట్ పోటీల్లో రాష్ట్ర స్థాయిలో సత్తా చాటడం కొసమెరుపు.

ఇస్నాపూర్ కమిషనర్‌కు సన్మానం

కమిషనర్‌ను సత్కరిస్తున్న ఇస్నాపూర్ నాయకులు

పటాన్‌చెరు, ఫిబ్రవరి 10: ఇస్నాపూర్ గ్రామ పంచాయతీ నుంచి మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ అయిన సందర్భంలో కొత్త మున్సిపల్ కమిషనర్ శ్రీహరిని గ్రామ నాయకులు ఘనంగా సన్మానించి స్వాగతం పలికారు. సోమవారం పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్‌లో మున్సిపల్ కార్యాలయంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన కమిషనర్ శ్రీహరిని ఇస్నాపూర్ ముదిరాజ్ సంఘం నాయకులు, పెద్దమ్మ తల్లి ఆలయ కమిటీ సభ్యులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. గ్రామం నుంచి మున్సిపాలిటీగా అభివృద్ధి చెందిన ఇస్నాపూర్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఈనెల 21న జరగనున్న పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవ కార్యక్రమానికి రావాలని ఆహ్వాన పత్రిక అందజేశారు. స్పందించిన కమిషనర్ ప్రజా సమస్యలపై దృష్టి సారించి ప్రజలకు మెరుగైన సేవలు అందజేస్తామన్నారు. విగ్రహ ప్రతిష్ఠాపకు హాజరవుతానని తెలిపారు. కార్యక్రమంలో యాదగిరి ముదిరాజ్, రాఘవేందర్ ముదిరాజ్, ఉళ్ల శంకర్, కంజర్ల రవి, గోపాల్, సోములు, ప్యాట నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సర్కారుతో సమరానికి సై

- డంపింగ్‌యార్డుకు వ్యతిరేకంగా 'సమరానికి సై' అన్న మహిళా సంఘాలు, రైతు సంఘాలు
- ఎన్‌హెచ్‌పై భారీ ర్యాలీ చేపట్టిన పలు గ్రామాల మహిళలు, యువకులు, జేఏసీ నాయకులు

గుమ్మడిదలలో డంపింగ్‌యార్డుకు వ్యతిరేకంగా ఎన్‌హెచ్‌పై భారీ ర్యాలీ నిర్వహిస్తున్న మహిళా సంఘాలు

గుమ్మడిదల, ఫిబ్రవరి10: డంపింగ్‌యార్డుకు వ్యతిరేకంగా మండలంలోని అన్ని గ్రామాల మహిళా సంఘాలు, రైతు సంఘాల నాయకులు, యువజన సంఘాలు భారీ ఎత్తున ఎన్‌హెచ్‌పై వందల సంఖ్యలో ర్యాలీ నిర్వహించారు. డంపింగ్‌యార్డు నిర్మాణం పనులు వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర సర్కారుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సోమవారం గుమ్మడిదల మండల కేంద్రంలో రైతు జేఏసీ కమిటీ అధ్యక్షుడు చిమ్ముల జైపాల్‌రెడ్డి సారధ్యంలో డంపింగ్‌యార్డు నిర్మాణానికి వ్యతిరేకంగా మహిళా సంఘాలు, రైతు సంఘాల నాయకులు, అఖిల పక్షపార్టీల నాయకులందరూ కలిసి జాతీయ రహదారి 765డీపై ర్యాలీ నిర్వహించారు. ఆరు రోజుల నుంచి డంపింగ్‌యార్డు పనులు పోలీస్ నిర్బంధంలో కొనసాగుతుండడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జై జవాన్..జై కిసాన్.. సేవ్ ఫారెస్ట్, రైతులను రక్షించండి, వద్దురా నాయనా.. డంపింగ్ యార్డు వద్దురా.. అంటూ నినాదాలు చేశారు. గ్రామంలో వాడవాడలా తిరుగుతూ ర్యాలీని కొనసాగించారు. ర్యాలీకి వెనుక ముందు భారీ సంఖ్యలో పోలీస్‌లను మోహరించారు. శాంతియుతంగా ఆందోళనలు చేస్తుంటే పోలీస్‌లు తమకు వెంబడిస్తున్నారని రైతు జేఏసీ నాయకులు అసహనం వ్యక్తం చేశారు. జేఏసీగా మద్దతుగా బ్రాహ్మణసంఘం, వర్తకసంఘం,ఏకలవ్య సంఘం, అంబేద్కర్ సంఘం, ముదిరాజ్‌సంఘం అన్ని కుల సంఘాలు మద్దతు ప్రకటించాయి. ఈ సందర్భంగా రైతు జేఏసీ కమిటీ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ నల్లవల్లి పంచాయతీ పరిధిలోని ప్యారానగర్ అటవీ ప్రాంతంలో ఆరు రోజుల నుంచి డంపింగ్ యార్డు నిర్మాణం పనులు చేయడం అన్యాయమన్నారు. ప్రజల అభిప్రాయం లేకుండా వ్యతిరేకంగా నిర్మాణం పనులు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం డంపింగ్ యార్డు అనుమతులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు, పర్యావరణానికి, చెరువులకు, కుంటలకు, వన్యప్రాణులకు ప్రమాదమని తెలిసి కూడా సర్కారు, జీహెచ్ ఎంసీ అధికారులు మొండిగా డంపింగ్ యార్డు నిర్మాణం పనులు చేయడంపై ధ్వజమెత్తారు. గుమ్మడిదల మండలంలో అన్ని గ్రామాల, అన్ని రాజకీయ పార్టీల నాయకులతో కలిసి జేఏసీ ఏర్పడినట్లుగానే నర్సాపూర్ నియోజకవర్గ ప్రజలు, నాయకులు జేఏసీగా మారి డంపింగ్ యార్డు నిర్మాణం పనులకు వ్యతిరేకంగా పోరుబాట చేయాలని వేడుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం డంపింగ్ యార్డు అనుమతులు రద్దు చేసే వరకు ఆందోళన, నిరసనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రాష్ట్ర సర్కారు దిగివచ్చి డంపింగ్‌యార్డును వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు గోవర్ధన్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కొత్తపల్లి ప్రభాకర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పుట్ట నర్సింగ్‌రావు, నాయకులు నరేందర్‌రెడ్డి, సద్ది విజయభాస్కర్‌రెడ్డి, కాలకుంటి రవీందర్‌రెడ్డి, డా.శ్రీనివాస్‌రెడ్డి, పీ.శ్రీనివాస్‌రెడ్డి, రైతు సంఘం అధ్యక్షుడు సదానందరెడ్డి, ఆలయ కమిటీ అధ్యక్షుడు మద్దుల బాల్‌రెడ్డి, వర్తక సంఘం అధ్యక్షుడు ఆకుల సత్యనారాయణ, మైత్రీ ఫౌండేషన్ చైర్మన్ ఉదయ్‌కుమార్, వాసుదేవారెడ్డి, దేవేందర్‌రెడ్డి, మందబలరాంరెడ్డి, తుడుం శ్రీనివాస్, మాజీ సర్పంచ్ చిమ్ముల నర్సింహారెడ్డి, మాజీ జడ్పీటీసీ కుమార్ గౌడ్, అన్ని ప్రైవేటు పాఠశాల ఉపాధ్యాయులు, పలు గ్రామాల మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు మహిళా, రైతు సంఘాలు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉండాలి

కలెక్టర్ వల్లూరు క్రాంతి

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి కలెక్టరేట్, ఫిబ్రవరి 10:త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులకు స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ రానున్న నేపథ్యంలో సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లాస్థాయిలో ఎన్నికల ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణ కోసం ముందస్తుగానే అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. పోలింగ్ బూత్‌లు, మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.. ఆర్వో, పీవో, ఏపీవోలకు మాస్టర్ ట్రైనర్లతో శిక్షణ ఇచ్చామని చెప్పారు. శిక్షణలో భాగంగా నియమ నిబంధనలపై పూర్తి అవగాహన ఏర్పర్చుకోవాలన్నారు. ఎలాంటి వివాదాలు, తప్పిదాలకు తావులేకుండా చూడాలన్నారు. ఎన్నికల నిర్వహణలో రిటర్నింగ్ అధికారులు క్రియాశీలక పాత్ర పోషించాల్సి ఉంటుందన్నారు. ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్‌ను అనుసరిస్తూ ఆర్వోలు నోటిఫికేషన్ జారీ చేసి, అదే రోజు నుంచి సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాల ఎన్నిక కోసం నామినేషన్లను స్వీకరించాలని వివరించారు. నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఉప సంహరణ పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్ అధికారులకు స్పష్టం చేశారు.

అక్షర ఆధారంగా అభ్యర్థుల పేర్లు

బ్యాలెట్ పేపర్‌లో అభ్యర్థుల పేర్లను అక్షరక్రమంలో ముద్రించాల్సి ఉంటుందని, ఓటరు జాబితాలోని పేరును అక్షర క్రమంగా పరిగణలోకి తీసుకుంటే ఇబ్బందులు ఉండవన్నారు. అభ్యర్థుల నామినేషన్లన్నింటినీ పరిశీలించాలని, వాటిలో ఎన్ని ఆమోదం పొందాయి, ఎన్ని తిరస్కరణకు గురయ్యాయి, అందుకు గల కారణాలను వెల్లడించాల్సి ఉంటుందన్నారు. ఈనెల 11న ఆర్వో, ఏఆర్వోలకు జహీరాబాద్, నారాయణఖేడ్, సంగారెడ్డి డివిజన్లలో, 12, 13 తేదీల్లో పీవో, ఏపీవోలకు ఆయా మండల ప్రధాన కార్యాలయాల్లో, 15న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణ కోసం శిక్షణ ఉంటుందన్నారు. అనంతరం మాస్టర్ ట్రైనర్ నామినేషన్ల ప్రక్రియను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ మాధురి, ట్రైనీ కలెక్టర్ మనోజ్, జెడ్పీసీఈవో జానకిరెడ్డి, డీపీవో సాయిబాబా, నోడల్ అధికారులు, ఆర్డీవోలు, ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంక్ పరిసరాల్లో నిలిచిన మురుగు

ఇండ్ల ఎదుట చేరిన మురుగు

పెద్దమ్మగూడెంలో పడకేసిన పారిశుధ్యం

జిన్నారం, ఫిబ్రవరి 10: ప్రత్యేక అధికారుల పాలనలో గ్రామాల్లో పారిశుధ్యం పడకేసింది. రోడ్లపైనే మురుగు పారుతూ దుర్వాసన వెదజల్లుతోంది. జిన్నారం గ్రామ పంచాయతీ పరిధిలోని పెద్దమ్మగూడెంలో రెండు నెలలుగా పారిశుధ్య సమస్యలతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామ పంచాయతీల పాలక వర్గం కాల పరిమితి ముగిసి, ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతున్నా అధికారుల పర్యవేక్షణ కొరవరడంతో సమస్యలు తిష్ట వేశాయి. అధికారులు కనీసం వారానికి ఒక్కరోజైనా గ్రామాల్లో పర్యటించకపోవడంతో రోడ్లపైనే మురుగు పరుగులు పెడుతోంది. స్థానిక వాటర్ ట్యాంక్ వద్ద నిత్యం మురుగు నిలవడంతో దోమలు, ఈగలతో స్థానికులు అల్లాడిపోతున్నారు. రెండు నెలలు గడుస్తున్నా తమ సమస్యను పట్టించుకునే వారే లేరని వాపోతున్నారు. దీంతో వాటర్ ట్యాంక్ చుట్టుపక్కల నివసించే ఇండ్లల్లోకి దోమలు, ఈగలు చేరి ఆరోగ్యాలను దెబ్బతీస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామానికి వచ్చే ప్రధాన రహదారి పక్కనే ఇలాంటి దుస్థితి నెలకొని ఉన్నా అధికారులకు కనిపించకపోవడం విడ్డూరంగా ఉందని మండిపడుతున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఆలయానికి ఆదాయం

ఆలయ ఆవరణలో వేలంపాట నిర్వహిస్తున్న సిబ్బంది

కోహీర్, ఫిబ్రవరి10: బడంపేట రాచన్నస్వామి ఆలయ ఆవరణలో సోమవారం ఉమ్మడి మెదక్ జిల్లా దేవాదాయ, ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శివరాజ్ సమక్షంలో వేలం పాట నిర్వహించారు. సంవత్సరంపాటు ఆలయ ఆవరణలో పూజా సామగ్రిని విక్రయించేందుకు మొదటి దుకాణం శ్రీకాంత్‌స్వామి రూ.4 లక్షలకు దక్కించుకొన్నాడు. రెండో దుకాణం రూ.3.80లక్షలకు వడ్డె రాజు కైవసం చేసుకొన్నాడు. గొల్ల సంజీవ్ రూ.3లక్షలకు హోటల్, గొల్ల మల్లేశం రూ.3.03లక్షలకు టెంట్ హౌస్‌ను తీసుకున్నారు. వ్యవసాయ భూమిని శివమూర్తి స్వామి రూ.1.65లక్షలకు దక్కించుకొన్నాడు. దుకాణాలు, టెంట్ హౌస్, హోటల్, వ్యవసాయ భూమిని వారు సంవత్సరంపాటు నిర్వహించుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో ఈవో శివరుద్రప్ప, జగదీశ్వర్‌స్వామి, శివానంద్, దయానంద్, రాజన్న రాచన్న, రఘుపతిరెడ్డి, సుధాకర్, శ్రీపాల్, నాగేశ్, తదితరులున్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఎలక్ట్రికల్ షాపు దగ్ధం

షాట్ సర్క్యూట్‌తో కాలిపోయిన వస్తువులు

జహీరాబాద్, ఫిబ్రవరి 10: జహీరాబాద్ పట్టణం ప్రధాన రోడ్డు మార్గంలోని ఓ ఎలక్ట్రికల్ షాపులో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి మెటీరియల్ దగ్ధమైంది. సోమవారం తెల్లవారుజామున పట్టణంలోని ప్రధాన రోడ్డు మార్గంలోని శంకర్ ఎలక్ట్రికల్ షాపులో ప్రమాదవశాత్తు జరిగిన షార్ట్ సర్క్యూట్ వల్ల మంటలు చెలరేగాయి. షాపులో ప్లాస్టిక్ మెటీరియల్ ఎక్కువగా ఉండడంతో మంటల తీవ్రత పెరిగింది. ఉదయం రోడ్డున వెళ్తున్న కొందరూ షాపులో నుంచి పొగలు వస్తుండం గమనించి షాపు నిర్వాహకుడితోపాటు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. షాపు షట్టర్ తాళాలను పగుల గొట్టి అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పివేశారు. అప్పటికే చాలావరకు ఎలక్ట్రికల్ వస్తువులు, మెటీరియల్ కాలిపోయాయి. షార్ట్ సర్క్యూట్‌తో దాదాపు రూ.40 లక్షల వరకు నష్టం జరిగినట్లు నిర్వాహకుడు భీమశంకర్ తెలిపారు. ఘటనా స్థలాన్ని జహీరాబాద్ పోలీసులు సందర్శించి వివరాలను అడిగి తెలుసుకున్నారు.

ఆలయాల్లో మంత్రి పూజలు

అందోల్, ఫిబ్రవరి 10: జోగిపేట పట్టణంలో నూతనంగా నిర్మించిన మల్లికార్జున స్వామి ఆలయం, రామాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన, పూజలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం నిర్వహించిన పూజా కార్యక్రమాలకు వైద్యారోగ్య శాఖల మంత్రి దామోదర రాజనర్సింహ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాల నిర్వాహకులు మంత్రికి ఘనస్వాగతం పలికి ఆలయంలో పూజలు నిర్వహించిన అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు. అంతకుముందు మాజీ కార్పొరేషన్ చైర్మన్ మఠం భిక్షపతి బీఆర్ఎస్ నాయకులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి,రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని కోరారు.

పద్మశాలీలు అన్ని రంగాల్లో రాణించాలి

మాట్లాడుతున్న రాష్ట్ర మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ అనిల్

జహీరాబాద్, ఫిబ్రవరి 10: పద్మశాలీలు అన్ని రంగాల్లో రాణించాలని రాష్ట్ర మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, బాల్కొండ మాజీ ఎమ్మెల్యే అనిల్ అన్నారు. ఆదివారం రాత్రి జహీరాబాద్‌లో నిర్వహించిన 30వ వనభోజన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. జహీరాబాద్ పట్టణ పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో ఆటలపోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రాజకీయంగా పద్మశాలీలు ఎదిగేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పద్మశాలీ కులస్తులు అధిక స్థానాల్లో పోటీ చేసి విజయం సాధించాలన్నారు. అసంపూర్తిగా ఉన్న పద్మశాలీ భవన నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్, మాజీ మంత్రి డాక్టర్ చంద్రశేఖర్, జహీరాబాద్ పట్టణ పద్మశాలీ సంఘం అధ్యక్షులు జనార్దన్, సంఘం నాయకులు, కులస్తులు పాల్గొన్నారు.

బీరప్ప స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన

బీరప్ప స్వామిని దర్శించుకున్న బీఆర్ఎస్ నాయకులు

రామచంద్రాపురం, ఫిబ్రవరి10: తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఈదులనాగులపల్లిలో నూతనంగా నిర్మించిన బీరప్పస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన, ధ్వజస్తంభ మహోత్సవం వైభవంగా జరిగింది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో స్వామివారికి పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గొల్లకురుమలు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. బీరప్ప స్వామి విగ్రహ ప్రతిష్ఠాపనతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. బీఆర్ఎస్ నాయకులు, ఆర్‌కే ఫౌండేషన్ చైర్మన్ కాల్వగడ్డ రాజ్‌కుమార్, మాజీ కార్పొరేటర్ అంజయ్యయాదవ్, మాజీ సర్పంచ్ మల్లేశం గౌడ్, కాంగ్రెస్ నాయకుడు కాట శ్రీనివాస్ గౌడ్ హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్ మాట్లాడుతూ బీరప్పస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన ఘనంగా జరిగిందని, ఆలయ నిర్మాణానికి తనవంతు సహాయం ఇచ్చానన్నారు.

ఘనంగా స్వయం పాలన

స్వయంపాలనలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

అందోల్, ఫిబ్రవరి 10: మండలంలోని తాలెల్మ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులు స్వయంపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకొన్నారు. ఒక్కరోజు ఉపాధ్యాయులుగా మారిన విద్యార్థులు చక్కగా పాఠాలు బోధించి ఆకట్టుకున్నారు. అనంతరం ప్రధానోపాధ్యాయుడు రమేశ్ విద్యార్థులను అభినందించి బహుమతులు అందజేశారు.

ఉపాధ్యాయులైన విద్యార్థులు

గుమ్మడిదల: స్వయం పాలన దినోత్సవంలో ఉపాధ్యాయులతో విద్యార్థులు

గుమ్మడిదల, ఫిబ్రవరి 10: మున్సిపాలిటీ పరిధిలోని ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం రాజు పర్యవేక్షణలో విద్యార్థులు సోమవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. డీఈవోగా యశ్వంత్, ఎంఈవోగా హాసిని, హెచ్ఎంగా అంకిత, ఉపాధ్యాయులుగా హర్షిని, నందిని, అర్చన, జయంతి, ప్రణతి, ఖుషబి హర్, అక్షిత, మహేందర్, సాయి, ప్రతాప్, రోహన్, నవీన్, నరేశ్, విజయ్ ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో సబిత, పూజిత, గంగలక్ష్మి, ఆనంద్‌కుమార్, నాగరాజు తదితరులు ఉన్నారు.

లబ్ధిదారుడికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు

పేదలకు భరోసా

జహీరాబాద్, ఫిబ్రవరి 10: అత్యవసర పరిస్థితుల్లో ప్రైవేటు దవాఖానల్లో చికిత్స పొందిన నిరుపేదలకు సీఎం సహాయ నిధి భరోసానిస్తుందని జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు అన్నారు. సోమవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన వాజీదాబేగానికి సీఎంఆర్ఎఫ్ కింద మంజూరైన రూ.15,000 చెక్కును అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అబ్దుల్లా, అలీం పాల్గొన్నారు.

నేడు కుస్తీ పోటీలు

జహీరాబాద్, ఫిబ్రవరి 10: న్యాల్‌కల్ గ్రామ శివారులో కులమతాలకు అతీతంగా జరిగే ఉర్సే షరీఫ్ పీర్‌గైబ్ సాహెబ్ దర్గా ఉత్సవాల్లో మంగళవారం అంతర్రాష్ట్ర కుస్తీ పోటీలు నిర్వహిస్తున్నామని నిర్వహక కమిటీ అధ్యక్షుడు యూనూస్‌ఖాన్ తెలిపారు. కుస్తీ పోటీల్లో విజేతలైన మల్లయోధులకు ప్రజాప్రతినిధులు, నాయకులు, నిర్వహక కమిటీ సభ్యుల కలసి వెండి కడియాలు, నగదు బహుమతులు అందజేస్తామని చెప్పారు. ఆసక్తి గల మల్లయోధులు పోటీల్లో పాల్గొనాలని సూచించారు.

శివాలయ నిర్మాణానికి విరాళం

జిన్నారం ఫిబ్రవరి 10: జిన్నారం మండల కేంద్ర సమీపంలోని తాంబేలు గుట్టపై నూతనంగా నిర్మిస్తున్న జీవన జ్యోతిర్లింగ శివాలయానికి భక్తుల నుంచి విరాళాలు కొనసాగుతున్నాయి. సోమవారం జిన్నారానికి చెందిన శ్రీ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ సత్యనారాయణ దంపతులు ఆలయ నిర్మాణానికి స్వచ్ఛందంగా ముందుకొచ్చి రూ.లక్ష విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు స్వాములు ఫణి గుప్తా, శ్రీకాంత్ పాల్గొన్నారు.

బాధితుడికి ఆర్థిక సహాయం

రాయికోడ్, ఫిబ్రవరి10: మండల పరిధిలోని రాయిపల్లి(సి) గ్రామంలో ఇటీవల షార్ట్ సర్క్యూట్‌తో మహమూద్ సాబ్ ఇల్లు దగ్ధమైంది. గ్రామస్తుల ద్వారా విషయం తెలుసుకున్న స్థానిక భవానీ ఫర్టిలైజర్ యజమాని, మండల బీఆర్ఎస్ నాయకుడు తుల్జయ్య తనవంతు సహాయంగా సోమవారం బాధితుడి ఇంటికెళ్లి రూ. 10వేల నగదుతోపాటు నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో తెలంగాణ మలిదశ ఉద్యమ నేత కాశీబస్వరాజ్ పాటిల్, మండల బీ